# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వైఎస్ఆర్ జిల్లా కడప లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ రోజు నామినేషన్ దాఖలు చేశారు.**

2. **2024-25 విద్యా సంవత్సరానికి బీఈడీలో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి తరపున ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏపీ ఎడ్‌సెట్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.**

3. **తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి గత ఏడాది భక్తులు కానుకలుగా సమర్పించిన వెయ్యి 161 కోట్ల రూపాయలను తిరుమల తిరుపతి దేవస్థానం వివిధ బ్యాంకుల్లో ఫిక్సిడ్ డిపాజిట్ చేసింది.**

4. **వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపుతామని వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.**

5. **కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.**

==========================

వైఎస్ఆర్ జిల్లా కడప లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద కుమార్తె సునీతతో కలిసి కడప కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారికి ఆమె తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు ఇడుపులపాయలో వైఎస్ ఘాట్ వద్ద నామినేషన్ పత్రాలను ఉంచి షర్మిల నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కడప నియోజకవర్గ ప్రజలు ఈ ఎన్నికల్లో మంచి తీర్పు ఇస్తారని భావిస్తున్నానని తెలిపారు.

--------------------------

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సూచించారు. నిన్న రాత్రి అనంతపురం క్లాక్ టవర్ వద్ద ఓటర్ల అవగాహనా కార్యక్రమం స్వీప్ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ నిర్వహించిన మానవహారం, కొవొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 13వ తేదీన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రజలు తప్పకుండా ఓటు వేయాలని కలెక్టర్ సూచిస్తూ..

.. వాయిస్...20 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యసించాలనుకునే వారి కోసం ఏపీ ఎడ్‌సెట్-2024 నోటిఫికేషన్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఈ అర్హత పరీక్షకు మే 15వ తేదీలోగా cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని ఏపీ ఎడ్‌సెట్ కన్వీనర్ టి.వి.కృష్ణ తెలిపారు. మే 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 2 వేల రూపాయల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

-----------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి గత ఏడాది భక్తులు కానుకల సమర్పించిన వెయ్యా 161 కోట్ల రూపాయలను తిరుమల తిరుపతి దేవస్థానం.. టీటీడీ వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. టీటీడీ ఇప్పటివరకు చేసిన నగదు డిపాజిట్లలో ఇదే అత్యధికం. దీంతో ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొత్తం 18 వేల కోట్ల రూపాయలకు చేరాయని టీటీడీ తెలిపింది. మరోవైపు.. 2023-24లో అత్యధికంగా వెయ్యా 31 కిలోల బంగారం డిపాజిట్ చేయగా.. టీటీడీకి మొత్తంగా 11 వేల 329 కిలోల బంగారం డిపాజిట్లు ఉన్నాయి.

-----------------------------

వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపుతామని వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. 08549 నెంబరు ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం ఒంటి గంటా 15 నిమిషాలకు విశాఖపట్నంలో బయలు దేరి ఆదివారం ఉదయం 7 గంటల 30 నిమిషాలకు బెంగళూరు చేరుకుంటుంది. 08550 నెంబరు ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరులో బయలుదేరి సోమవారం ఉదయం 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

-----------------------------

విజయనగరం జిల్లాలో ఈ నెల 27వ తేదీన జరిగే పాలిసెట్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత ఆదేశించారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష-2024 నిర్వహణపై తన ఛాంబర్‌లో ఈ రోజు ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పరీక్షకు సుమారు 8 వేల 864 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విజయనగరంలో 11, గజపతినగరంలో 6, బొబ్బిలిలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. విజయనగరం కేంద్రాల్లో 4వేల509 మంది, గజపతినగరంలో 2 వేల 9 మంది, బొబ్బిలిలో 2 వేల 346 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను గంట ముందు లోపలికి అనుమతిస్తామని డీఆర్వో తెలిపారు.

-----------------------------

ప్రభుత్వ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేని పరిసితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. రాజమహేంద్రవరం పార్టీ కార్యాలయంలో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికే రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు. గోదావరి

నది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం 57 కోట్లు కేటాయిస్తే ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేయలేదని తెలిపారు. గోదావరిలో ఇష్టానుసారం జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల వల్ల రహదారి, రైలు వంతెన పరిస్థితి ప్రమాదకరంగా మారిందని పురందేశ్వరి ఆందోళన వ్యక్తంచేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వి.ఎస్.ఎం.రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.18 సెకన్లు....

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చులపై సమగ్ర పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణపై జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు నోడల్ అధికారులతో నిన్న ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి కార్యాచరణ రూపొందించామని, సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై నిఘాను మరింత పెంచామని తెలిపారు. దీనిలో భాగంగా 24 వీడియో సర్వైవల్ బృందాలను నియమించామన్నారు. వీటికి అదనంగా 25 వీడియో, 16 అకౌంటింగ్ బృందాలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నాయని తెలిపారు.

---------------------------

వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా సూచించారు. నిన్న ఆయన లోతు గెడ్డ, చింతపల్లి, అర్వీ నగర్, గూడెం కొత్తవీధి ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఔషధాల నిల్వలు, వార్డులు, టీబీ రికార్డులు, రిజిస్టర్ల తనిఖీలు నిర్వహించి, రక్తహీనత నివారణ మాత్రల సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. గిరిజన బాలికల్లో రక్తహీనత నివారణకు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా గూడెంకొత్తవీధి, ఆర్వీనగర్, మినుము లూరు, గన్నెల పరిధిలోని నాలుగు ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని జమాల్ బాషా తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శేషాచల అడవుల్లో నాలుగురోజుల క్రితం మొదలైన మంటలు మరింతగా వ్యాపిస్తోంది. మామండూరు సమీపంలోని అడవిలో మంగళవారం మొదలైన మంటలు క్రమంగా సానరాళ్ల బండ వైపు చేరుకోగా నిన్న కాకులకొండ మీదుగా పాప వినాశనం మార్గంలోని పార్వేటమండపం, శ్రీగంధవనం వైపుగా వ్యాపించాయి. తిరుమల సమీపానికి మంటలు వస్తున్న క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం వాటిని అదుపుచేసే ప్రయత్నం చేసింది. అయితే ఇప్పటికే దాదాపు 500 హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతై ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

=====================